క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



నాగశర్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న రెడ్డి రమణ, తదితరులు

విజయనగరం టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి స్వచ్ఛంద సంస్థలు సహాయమందించేందుకు ముందుకు వస్తున్నాయి. ఇటీవల అలమండ సమీపంలో జరిగిన బైక్ యాక్సిడెంట్‌లో స్థానిక దాసన్నపేట వద్ద నివాసం ఉంటున్న గంటి భాస్కర నాగశర్మ తీవ్రంగా గాయపడ్డాడు. తలకు గాయం కావడంతో శస్త్రచికిత్స నిమిత్తం రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న ఆశయ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు రెడ్డి రమణ శనివారం యువకుడిని కలిసి రూ.15 వేలు అందజేశారు. అమెరికాలో ఉంటున్న సహృదయ ఫౌండేషన్ వ్యవస్థాకులు తాడివాక బిందు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మేమున్నాం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు కేఎస్ఎన్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి



పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

విజయనగరం ఫోర్ట్: పేదలకు చేయూత ఇవ్వడంలో సంతృప్తి ఉందని మారుతీ స్వయం సహాయక సంఘం అధ్యక్షుడు గుత్తురు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక కణపాక అగురవీధిలో సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు నిత్యావసర వస్తువులు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. పేదలకు ప్రతి ఒక్కరూ తమకు తోచిన రీతిన సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నాగరాజు, తులసీరామ్, తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి సమస్యకు చెక్



నాగళ్లవలసలో నిర్మించిన వాటర్ ట్యాంక్

గుర్ల: మండలంలోని నాగళ్లవలసలో తాగునీటి సమస్యకు స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు చెక్ చెప్పారు. గ్రామంలో రూ.65 లక్షలతో రక్షిత మంచినీటి పథకం (వాటర్ ట్యాంక్)ను నిర్మించడంతో పాటు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశారు.గతంలో తాగునీటికి ఇబ్బందిపడే వారమని, ప్రస్తుతం సమృద్ధిగా తాగునీరు అందుతోందని మహిళలు చెబుతున్నారు.

రోడ్డు విస్తరణ పనులకు కొలతలు



ఆకులసీతంపేట వద్ద రోడ్డు లెవెల్స్ పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ సిబ్బంది

వేపాడ: సోంపురం వయా వేపాడ –ఆనందపురం రహదారి విస్తరణకు ఆర్అండ్‌బీ సిబ్బంది ఆదివారం కొలతలు తీశారు. ఆర్అండ్‌బీ ఏఈ రామన్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా లెవెల్స్ పరిశీలించామని చెప్పారు. రోడ్డు వేసిన తర్వాత మరోసారి లెవెల్స్ చూస్తామన్నారు. రోడ్డు పనులు చేపట్టేందుకు మరికొంత సమయం పట్టే అవకాశముందని తెలిపారు.

ఆశాజనకంగా అపరాల సాగు



గర్భాంలో సాగులో ఉన్న మినప చేను

మెరకముడిదాం: మండలంలో అపరాల సాగు ఆశాజనకంగా ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నా రు. గర్భాం, చినబంటుపల్లి, సోమలింగాపురం, భైరిపురం, బుధరాయవలస, మెరకముడిదాం, యాడిక తదితర గ్రామాల్లో 162 ఎకరాల్లో రైతులు మినప, పెసర, నువ్వు పంటలను సాగుచేస్తున్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి తడులతో చేతికందే పంటలు కావడంతో రైతులు వీటి సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

ఉద్యాన పంటలకు ఉపాధి ఊతం

- పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం
- నూరుశాతం సబ్సిడీ, మూడేళ్ల పాటు సాగు ఖర్చులు అందజేత
- ఐదు ఎకరాలలోపు సన్న, చిన్నకారు రైతులు అర్హులు
- మండలానికి 200 ఎకరాల్లో తోటల సాగు లక్ష్యం



చౌడువాడలో ఉపాధిహామీ పథకం నిధులతో వేసిన కొబ్బరి మొక్కలు

పూసపాటిరేగ: రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు నూరు శాతం సబ్సిడీతో ఉద్యాన తోటలు పెంచేందుకు చర్యలు చేపట్టారు. మండలానికి 200 ఎకరాల్లో ఉద్యాన తోటలు పెంచాలని లక్ష్యంగా నిర్ణయించారు. క్షేత్రస్థాయి సిబ్బంది అర్హులైన రైతులను గుర్తించే పనిలో ఉన్నారు. ఐదు ఎకరాలలోపు సన్న, చిన్నకారు రైతులంతా ఈ పథకానికి అర్హులు. కొబ్బరి, జీడి, మామిడి, జామ, దానిమ్మ, సపోటా, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, తదితర తోటలు సాగు చేయవచ్చు. రైతులు వేయదల్చుకున్న ఉద్యానవన పంటల మొక్కలను ఉపాధిహామీ పథకం అధికారులు అందిస్తారు. రైతులే స్వయంగా మొక్కలు కొనుగోలు చేసుకుంటే.. ఆ బిల్లులను అధికారులకు అందిస్తే వాటిని పరిశీలించి నగదును లబ్ధిదారుల అకౌంట్‌లో జమ చేస్తారు. ఉద్యానపంటల సాగు ప్రోత్సాహక బాధ్యతలను ఉపాధిహామీ ఏపీఓ, ఈసీ, సాంకేతిక, క్షేత్ర సహాయకులకు అప్పగించారు. ఆసక్తి ఉన్న రైతులను గుర్తించి దీనిపై వారికి అవగాహన కల్పిస్తున్నారు.

మూడేళ్ల వరకు సాగు ఖర్చులు..

పండ్లతోటల పెంపకానికి ఎంపికై న రైతులు దుక్కులు మొదలు, మొక్కలకు గుంతలు తీయడం, మొక్కలు నాటేందుకు ఉపాధిహామీ పథకం కింద పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది. ఎకరానికి 70 మొక్కలు చొప్పన అధికారులు అందిస్తారు. వాటిని మూడు అడుగుల లోతు గుంతలు తవ్వి నాటుకోవాలి. రవాణా చార్జీలు, కలుపు తీయడం, ఎరువులు, పురుగు మందుల ఖర్చులు, నీటి వినియోగ ఖర్చులు కూడా ప్రభుత్వం సబ్సిడీ రూపంలో రైతుల బ్యాంకు అకౌంట్‌లో నగదు జమచేస్తుంది. మూడేళ్ల వరకు రైతులు సాగు ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. పంటను బట్టి రైతులకు లక్ష రుపాయలు పైగానే ప్రభుత్వం నుంచి అందుతుంది. జిల్లాలో అత్యధికంగా కొబ్బరి, జీడి, మామిడి, జామ తోటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయా పంటల సాగుకు ఎక్కువ మంది రైతులు దరఖాస్తు చేశారు. ఇప్పటికే సుమారు 2 వేలు మంది రైతులు ఉద్యాన తోటల సాగుపై ఆసక్తి చూపినట్లు అధికారులు తెలిపారు. తీరప్రాంతంలో అత్యధికంగా కొబ్బరి సాగును చేయడం వల్ల త్వరితగతిన ఫలసాయం అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఖర్చులతోనే సాగు



ఉపాధిహామీ పథకంలో నూరుశాతం సబ్సిడీపై పండ్ల తోటల పెంపకం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. చిన్న, సన్నకారు రైతులు దీన్ని వినియోగించుకోవాలి. పెట్టుబడి ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. ఆసక్తి ఉన్న రైతులు గ్రామ సచివాలయాల్లో ఉన్న వ్యవసాయశాఖ సహాయకులు, ఉద్యానవన సహాయకులు, మండల స్థాయిలో ఉపాధిహామీ పథకం అధికారులను సంప్రదించి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి.

– రత్నమాల, ఉపాధిహామీ పథకం ఏపీఓ, పూసపాటిరేగ మండలం

అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారితో పాటు మండలంలోని పుర్రేయవలస వద్ద ఉన్న మానసాదేవీ అమ్మవారిని నెలిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ విజయనగరం యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ ఉన్నారు.



కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు దంపతులు

కొనసాగుతున్న కార్మికుల ఆందోళన

కొత్తవలస: అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని జిందాల్ స్టెయిన్‌లెస్‌స్టీల్ కర్మాగార కార్మికుల ఆందోళన కొనసాగుతోంది. ఆదివారం నాటికి కార్మికుల ఆందోళన 17వ రోజుకు చేరింది. ముడిసరుకు కొరత కారణంగా కర్మాగారం యాజమాన్యం లేఆఫ్‌ను ప్రకటించడంతో కార్మికులు కర్మాగారం గేటు వద్ద నిరసన తెలుపుతున్నారు. కార్మికులకు ఇప్పటికే పలు కార్మిక సంఘాలతో పాటు పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. కర్మాగారాన్ని తెరిచి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కర్మాగార యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే విజయనగరం డిప్యూటీ లేబర్ కమిషనర్ వద్ద కార్మికుల యాజమాన్యం ప్రతినిధులు చర్చలు జరిపినా సఫలం కాలేదు.ఇప్పటికైనా యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని లేదంటే ఈనెల 4వ తేదీ తర్వా త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కార్మికులు హెచ్చరించారు. పలు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్మికులు

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు స్పోర్ట్స్ దుస్తులు అందజేస్తున్న డాక్టర్ సత్యశేఖర్, రమేష్, శ్రీరాములు

శృంగవరపుకోట: స్థానిక కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా రెండురోజులుగా నిర్వహిస్తున్న టోర్నీకి ఆదివారం స్థానిక వైద్యులు సత్యశేఖర్, ఆనల రమేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా వారు చీఫ్‌కోచ్ పి.శ్రీరాములు, కొంత మంది క్రీడా ఔత్సాహికుల సహకారంతో సమకూర్చిన క్రీడా దుస్తులను క్రీడాకారులకు పంపిణీ చేశారు. క్రీడాకారులను ఉద్దేశించి డాక్టర్ సత్యశేఖర్ మాట్లాడుతూ క్రీడల్లో తగిలే గాయాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్వల్పగాయాలు, దెబ్బలు తగిలినప్పుడు చేయాల్సిన ప్రాథమిక చికిత్స పద్ధతులను వారికి వివరించారు. మానసిక ఆరోగ్యం, శారీరక ధృడత్వాన్ని క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. క్రీడాకారుల తల్లిదండ్రులు, కోచ్‌లు మహ్మద్ అస్లాం, బి.హారిక, పి.మౌనిక హాజరయ్యారు. అనంతరం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లను ఆసక్తిగా తిలకించారు.

కామ్రేడ్ సత్యనారాయణ సేవలు మరువలేనివి

నెల్లిమర్ల: కామ్రేడ్ కాళ్ల సత్యనారాయణ సేవలు మరువలేనివని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్ అన్నారు. జరజాపుపేట గ్రామానికి చెందిన కాళ్ల సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయన సంస్మరణ సభను గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సత్యనారాయణ ఒక సాధారణ జ్యూట్‌మిల్లు కార్మికునిగా ప్రస్థానం ప్రారంభమై సర్దార్ స్థాయి వరకు సాగిన విధానం అభినందనీయం, స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో సత్యనారాయణ భార్య ఆనందమ్మ, కుమారుడు కామ్రేడ్ సన్యాసిరావు, ప్రముఖ వైద్యులు ప్రేమ్‌జిత్‌రే, పి.పద్మ, ఫాల్గుణరావు, వై.పరశురామ్, బోని సత్యనారాయణ, ఎస్.శ్రీను, కాళ్ల అప్పలసూరి, తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామారావు, ప్రసాద్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

దత్తిరాజేరు: పాచలవలస గ్రామంలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివా రం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులతో అర్చకులు రవిస్వామి ప్రత్యేక పూజలు చేయించా రు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం చేశారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

గజపతినగరం: హనుమాన్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో హనుమాన్ శోభాయాత్రను భక్తులు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి చిత్రపటాన్ని వాహనంపై ఉంచి పట్టణంలోని ప్రధాన జంక్షన్‌లలో ఊరేగించారు. జైహనుమాన్ నామస్మరణతో పట్టణం మార్మోగింది. కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, యు.ఎస్.ఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అభిషేకాలు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ నేతృత్వంలో అమ్మవారికి ఆదివారం ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించారు. అమ్మవారి దర్శ నానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి దేవస్థానం ఆవరణలో ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



వేపాడ: వేసవి శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో పేపర్లతో తయారు చేసిన బొమ్మలను చూపిస్తున్న విద్యార్థులు

వేపాడ/చీపురుపల్లిరూరల్(గరివిడి): శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు ఉల్లా సంగా, ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వేపాడ గ్రంథాలయంలో విద్యార్థులకు లైబ్రేరియన్ చంద్రశేఖర్ సోలార్ సిస్టమ్ (సౌరవ్యవస్థ) వల్ల కలిగే ప్రయోజనాలపై ఆదివారం అవగాహన కల్పించారు. అనంతరం వ్యాస రచన, ఆటల పోటీలు నిర్వ హించారు. విజేతలకు శిబిరం ముగింపు రోజున బహు మతులు అందజేయనున్నట్లు తెలిపారు. గరివిడి గ్రంథాల యంలో విద్యార్థులకు లైబ్రేరియన్ ఎం.ఉషారాణి పేపర్ క్రాఫ్ట్, పుస్తకపఠనంపై అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని వండానపేట, కె.ఎం.వలస గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం పీఆర్‌పీ రమాదేవి.. ప్రకృతి వ్యవసాయ విధానాలు, వాటిని అవలంభించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. పంటల సాగులో రైతులు ఎక్కువగా రసాయన ఎరువులను వాడడం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు సాధించలేమన్నారు. సేంద్రియ ఎరువుల ద్వారా పంటలు సాగు చేస్తే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలని, సమాజానికి ఆరోగ్యవంతమైన పంటలు అందించాలన్నారు. అనంతరం పేడగత్తం లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌డీఏ జె.అప్పలనాయుడు, ఐసీపీ కె.పార్వతి తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ ప్రయోజనాలను వివరిస్తున్న పీఆర్‌పీ రమాదేవి

సంబరాలు, బాణసంచా కాల్చడంపై నిషేధం

వేపాడ: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయని, విజయోత్సవ ర్యాలీలు, సంబరాల నిర్వహణ, బాణసంచా కాల్చడం వంటి వాటిపై నిషేధం విధించినట్లు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 4,5వ తేదీల్లో ప్రతి గ్రా మంలో 144 సెక్షన్ అమలులో ఉం టుందని పేర్కొన్నారు. ఏపార్టీకి చెందిన వారైన విజయం సాధించారని సంబరాలు చేయడం అరవడం, కేకలు వేయడం, దుర్భాషలు చేయటండం లాంటి పొరపాట్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత కేసుల్లో ఇరుక్కొని భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు.

గొడవలకు పాల్పడితే కేసులు

దత్తిరాజేరు: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడనున్నాయని, ఎవరైనా గ్రామాల్లో తగాదాలకు పాల్పడిన, ప్రోత్సహిం చినా కేసులు నమోదు చేస్తామని పెదమానాపురం ఎస్ఐ శిరీష తెలిపారు. శనివారం రాత్రి దత్తి,పోరలి గ్రామాల్లో గ్రామస్తులకు అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీల పరంగా విడిపోయి యువత గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కొని జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితువు పలికారు. విజయోత్సవ సంబరాలు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు.



దత్తిరాజేరు: పోరలి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శిరీష

వృథాగా తాగునీరు

- పాఠశాల ప్రాంగణం జలమయం
- పట్టించుకోని అధికారులు

శృంగవరపుకోట: మండే ఎండలతో తాగునీరు దొరక్క జనం అల్లాడుతున్న తరుణంలో ప్రాణాధారమైన తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోని నిర్లక్ష్యంపై ప్రజలు నిరసన తెలుపుతున్నారు. ఎస్.కోట మండలంలో కృష్ణాపురం పంప్ హౌస్ నుంచి విశాఖపట్నం నగరానికి తాగునీరు అందించే పైప్‌లైన్‌కు కొత్తూరు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద లీక్ ఏర్పడింది. దీంతో గడిచిన రెండు రోజులుగా నీరు వృథాగా పోతోంది. దీంతో పాఠశాల ప్రాంగణం చెరువులా మారింది. తాగునీరు వృథాగా పోతోందని కృష్ణాపురం వాటర్‌వర్క్స్ సిబ్బందికి చెప్పినా వాళ్లెవ్వరూ స్పందించలేదని గ్రామస్తులు చెబుతున్నారు. అదే సమయంలో జీవీఎంసీ అధికారులు సైతం ఇటు కన్నెత్తి చూడలేదు. ఇటు ఎస్.కోట పట్టణంలో తాగునీటి కొరతతో జనం అల్లాడుతుంటే ఇక్కడ ప్రాణధారమైన శుద్ధజలం బురద పాలవుతోంది.అధికారుల నిర్లక్ష్యం వీడి సమస్యను పరిష్కరించాలని కొత్తూరు గ్రామస్తులు కోరుతున్నారు.



పైప్‌లైన్ లీకు కావడంతో చెరువులా మారిన కొత్తూరు ప్రాథమిక పాఠశాల ప్రాంగణం

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం



నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న రాజాం పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యులు



రాజాం సిటీ: సమావేశంలో మాట్లాడుతున్న పర్యావరణ పరిరక్షణ సమితి రాజాం కన్వీనర్ నాయుడు

రాజాం: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా రాజాం పర్యావరణ పరిరక్షణ కమిటీ కృషి చేస్తోంది. ఈ నెల 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని, పట్టణంతో పాటు పట్టణ పరిసర ప్రాంతాల్లో మొత్తం వెయ్యి మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కమిటీ కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు ఆదివారం తెలిపారు. ఇప్పటికే ఎక్కడెక్కడ ఎన్నెన్ని మొక్కలు నాటాలని ప్రణాళికలు కూడా రూపొందించడం జరిగిందన్నారు. తొలి విడతలో రాజాంలో 650 మొక్కలు నాటుతున్నామని, దీనికోసం కడియం నర్సరీ నుంచి మొక్కలు తెప్పిస్తున్నామన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలు కూడా చూసుకునేలా సబ్ కమిటీలను కమిటీ ఏర్పాటు చేస్తోందన్నారు. స్థానిక పట్టణంలోని పలు సంఘాల నేతలు, పలువురు వ్యాపారవేత్తలు, వైద్యులను కమిటీ సభ్యులు ఆదివారం కలిసి, తమ కార్యక్రమ ప్రణాళిక రూపొందించి, వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన ఆయన.. మొక్కల కొనుగోలుకు అవసరమైన నిధులు సమకూర్చడానికి పలువురిని భాగస్వాములుగా చేస్తున్నట్లు తెలిపారు. వ్యాపారులు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం రాజాం నర్సరీలోని పలు మొక్కలను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని, ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు.

మొక్కలను వృక్షాలు చేద్దాం..

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే మానవాళి మనుగడ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కల పెంపకానికి ముందుకురావాలని పర్యావరణ పరిరక్షణ సమితి రాజాం కన్వీనర్ ఆర్.వి.జె.నాయుడు కోరారు. స్థానిక పట్టణంలోని సూర్యదుర్గ కల్యాణ మండపం ఆవరణలో 1000 మొక్కలు నాటుదాం –1000 వృక్షాలు చేద్దాం కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తేదీన పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని, పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు. మొక్కలు నాటడమే కాకుండా మొక్కల పెంపకం బాధ్యతలు కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.స్వప్నహైందవి, పెంకి చైతన్య, అదపాక దామోదరరావు, కొల్లా పార్థసారధి, దాసరి సురేష్, ఈసర్ల మురళి, శాసపు వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

రాజాం సిటీ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు కోరారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో ఎన్‌సీసీ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో యువత ఎక్కువగా ట్రిపుల్ రైడింగ్‌తో ర్యాష్ డ్రైవింగ్ చేసి ప్రమాదాల బారినపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని సూచించి, దాని వలన కలిగే నష్టాలను వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి ఫొటోలు, వీడియోలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. కార్యక్రమంలో సంతకవిటి ఎస్ఐ షేక్ శంకర్, 14వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ డాక్టర్ ప్రసూన్ కుమార్ పండా, డిప్యూటీ క్యాంపు కమాండెంట్ మేజర్ వంగ మహేష్, సుబేదార్ మేజర్ సుభాష్ చాంద్, లెఫ్టినెంట్‌లు సోమేశ్వరరావు, ఆర్.చంద్రసురేష్, థర్డ్ ఆఫీసర్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.